సాక్షి
జగిత్యాల
గురువారం • 9 • ఫిబ్రవరి • 2023



## గోదావరిలో పుణ్య స్నానాలు

ధర్మపురి: ధర్మపురిలోని పవిత్ర గోదావరిలో బుధవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు.



## ఉద్యోగాలు వద్దట..!

టాస్క్‌లో శిక్షణ తీసుకున్న విద్యార్థులు అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను వదులుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రుల అనాసక్తి అని తెలుస్తోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/17.0

## వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురు గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

కరీంనగర్: మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఖుస్రో షా ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ శైవక్షేత్రాలకు సైతం ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈనెల 17,18,19 తేదీల్లో కరీంనగర్ నుంచి 80 బస్సులు, కోరుట్ల నుంచి 60, మెట్‌పల్లి నుంచి 60, జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి 42, కొండగట్టు /జగిత్యాల నుంచి 37, సిరిసిల్ల నుంచి 11, వరంగల్–హుజూరాబాద్ నుంచి 45 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వేములవాడ బస్టాండ్ నుంచి గుడి వరకు 14 మినీ బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

**వేలాల జాతరకు..**

వేలాల జాతరకు గోదావరిఖని, మంథని డిపోల నుంచి, కాళేశ్వరానికి మంథని, కరీంనగర్, గోదావరిఖని డిపోల నుంచి రద్దీని బట్టి బస్సులు నడుపుతామని తెలిపారు. జగిత్యాలలోని దుబ్బరాజన్న, హుస్నాబాద్ మండలం పొట్లపల్లి జాతరకు, మంథని నుంచి సిరొంచకు ఆరు బస్సులు భక్తుల రద్దీని బట్టి నడుపుతామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆర్మూర్, నర్సంపేట, వరంగల్, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి నుంచి కూడా వేములవాడ దేవస్థానానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు.

### విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈ

గొల్లపల్లి(ధర్మపురి): రైతులు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని ఎస్‌ఈ సత్యనారాయణ సూచించారు. కెపాసిటర్లు పెట్టుకోవడం వల్ల కలిగే లాభాలపై మండలంలోని చిల్వాకోడూర్ సెక్షన్ పరిధి అబ్బాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో విద్యుత్ లోడ్ 280 మెగావాట్స్ నుంచి 371.81 మెగావాట్స్‌కు చేరుకున్నందున రైతులందరూ వంద శాతం మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకుని అధిక లోడ్ తగ్గించి విద్యుత్ కోతలు తగ్గించుకోవచ్చన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ మీద లోడ్ తక్కువ పడుతుందని తెలిపారు. లో వోల్టేజి సమస్య తగ్గి మోటార్ హీట్ కాకుండా ఉంటుందని వివరించారు. తక్కువ సమయంలో ఎక్కువ నీటిని తోడటం, నాణ్యమైన కరెంట్ సరఫరా అవుతుందని పేర్కొన్నారు. ఆటో స్టార్టర్ పెట్టుకోవడం వల్ల నష్టాల గురించి వివరించారు.

### పెండింగ్ చలాన్లు ఉంటే వాహనాలు సీజ్



పెండింగ్ చలాన్లు చెల్లించిన రశీదును ఎస్సైకి అందజేస్తున్న వాహనదారు

జగిత్యాలక్రైం: పెండింగ్ చలాన్లు ఉన్న వాహనాలు బయట తిరిగితే సీజ్ చేయడం జరుగుతుందని ట్రాఫిక్ ఎస్సై రాము అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణానికి చెందిన రఫీ వాహనాల తనిఖీలో పట్టుబడగా తన వాహనంపై 38 చాలాన్లు రూ.10,150 ఉండగా వాహనాన్ని సీజ్ చేశారు. వెంటనే వాహనదారు రఫీ మీసేవలో రూ.10,150 చెల్లించి ట్రాఫిక్ ఎస్సై రాముకు రశీదు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ప్రతీ వాహనంపై మూడు చలాన్ల కంటే ఎక్కువ ఉంటే వాటిని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. వాహనాలపై పెండింగ్ చలాన్లు యజమానులు వెంటనే చెల్లించాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

### గ్రామాన్ని సందర్శించిన డీఎల్‌పీవో


ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని గ్రామాల్లో చేయాల్సిన పనులు, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చూడాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని వర్షకొండ గ్రామాన్ని సందర్శించారు. గ్రామపంచాయతీలో వివిధ రకాల రికార్డులు ఏ విధంగా నమోదు చేస్తున్నారో తనిఖీ చేశారు. అనంతరం నర్సరీల్లో మొక్కలను, వర్మి కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య తదితర పనులను పరిశీలించాలని, ఎమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్నకు 50 కోట్లు.. అంజన్నకు 100 కోట్లు..

## బడ్జెట్‌లో రెండు ప్రధాన ఆలయాలకు నిధుల కేటాయింపు

### కొండగట్టుకు మాస్టర్‌ప్లాన్..

- కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి బడ్జెట్‌లో రూ.100 కోట్లు మంజూరు చేశారు. గత డిసెంబరు 7న జగిత్యాల సభలో స్వామివారికి రూ.100 కోట్లు ఇస్తామన్న సీఎం.. సరిగ్గా 50 రోజులకు తన మాట నిలబెట్టుకున్నారు. రానున్న 50 ఏళ్లలో భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాల్సి ఉందని, ప్రత్యేక ప్రణాళికతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు.





కొండగట్టు- వేములవాడ ఆలయాలు

- నాంపల్లి గుట్టపై త్వరలో రోప్‌వే ఏర్పాటు
- కోటిలింగాల, గోదావరిఖని, ఎల్‌ఎండీలలో మరిన్ని పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని కొండగట్టు అంజన్న, వేములవాడ రాజన్న ఆలయాలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం దక్కినట్లయ్యింది. మొన్న రాజన్న ఆలయానికి రూ.50 కోట్లు కేటాయించిన సర్కారు.. తాజాగా కొండగట్టుకు రూ.100 కోట్లు ప్రకటించింది. దీంతో ఆలయాల అభివృద్ధికి ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్న ఘడియలు వచ్చినట్లయ్యింది.

**ఎములాడ జంక్షన్ల సుందరీకరణ..**

రాజన్న గుడి అభివృద్ధిపై సీఎం కేసీఆర్ 18 జూన్ 2015న స్వయంగా గుడి, పట్టణం కలియ తిరిగారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఇందుకు ఏటా రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని ప్రకటించారు.


- ముందుగా రూ.71 కోట్లు మంజూరు చేశారు. అనంతరం వీటీడీఏ ఏర్పాటు చేసి కమిటీనీ ప్రకటించారు. చైర్మన్‌గా సీఎం కేసీఆర్, వైస్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పురుషోత్తం రెడ్డిని నియమించారు. నిధులను వీటీడీఏ ద్వారానే ఖర్చు చేయాలని జీవో విడుదల చేశారు.
- ఆ మేరకు ఆలయ అధికారులు రూ.410 కోట్లతో భక్తుల సౌకర్యాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు.

గతేడాది, ఈసారి బడ్జెట్‌లో రూ.50 కోట్ల చొప్పున కేటాయించారు.

- తాజా నిధులతో బద్దిపోచమ్మ గుడి వద్ద సేకరించిన భూమికి ప్రహరీ, బోనాల మంటపం నిర్మిస్తామని వీటీడీఏ వైస్ చైర్మన్ వెల్లడించారు. నగరమంతా ఫుట్‌పాత్‌ల నిర్మాణం, గుడి ట్యాంక్‌బండ్‌పై వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ పనులు చేపడతామని, నందికమాన్ నుంచి వేములవాడకు చేరుకునే రోడ్డు సుందరీకరణ, జంక్షన్లు అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

### నాంపల్లి గుట్టకు రోప్‌వే

- వేములవాడను తీర్చిదిద్దే క్రమంలో మంత్రి కేటీఆర్ సూచనల మేరకు నాంపల్లిగుట్టపై రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం జరగనుంది. వేములవాడకు వచ్చే కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వేట్రాక్ నాంపల్లి గుట్టను ఆనుకుంటూ వెళ్లనుంది. దీంతో హైదరాబాద్, మేడ్చల్, గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నుంచి వచ్చే భక్తులకు ఆహ్లాదకరంగా ఉండేలా ఇక్కడి పరిసరాలను తీర్చిదిద్దనున్నారు. ఈ పనులపై కేటీఆర్ ఇప్పటికే సమీక్షించారు కూడా.



నాంపల్లి గుట్టపై ప్రతిపాదిత కేబుల్ కారు

### కాళేశ్వరం టూరిజం సర్క్యూట్

- రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక కాళేశ్వరం.. దాని అనుబంధ ప్రాజెక్టుల వద్ద పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ పేరిట బడ్జెట్‌లో రూ.750 కోట్లు కేటాయించింది. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ, గోదావరిఖని వంతెన, కోటిలింగాల బ్యాక్ వాటర్, లోయర్, మధ్య, ఎగువ మానేరు డ్యామ్‌ల వద్ద పర్యాటక అభివృద్ధికి ఈ నిధులు వెచ్చించనున్నారు.



గోదావరిఖని వద్ద రెగెట్టా పోటీలు

అయితే ఉమ్మడి జిల్లాను పర్యాటక క్షేత్రంగా మలచాలన్న ప్రభుత్వ లక్ష్యం ఎప్పటిలోగా నెరవేరుతుందోనన్న విషయం ఆసక్తికరంగా మారింది.

## ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని చెప్పారు. పల్లె ప్రగతిలో ఇంకుడు గుంతలు (సోక్ పిట్స్) నిర్మాణం చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను నెలకొల్పాలని సూచించారు. పల్లె ప్రకృతి వనాలను, మంకీ కోర్టులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో రామానుజాచారి, డీఆర్‌డీవో పీడీ లక్ష్మీనారాయణ, డీపీవో నరేష్ పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాల: డబుల్ బెడ్‌రూంలకు సంబంధించిన వివరాలు కోరితే తహసీల్ కార్యాలయంలో వివరాలు లేవని అంటున్నారని, హౌసింగ్ కార్యాలయంలో ఉంటాయని చెబుతున్నారని 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ, కలెక్టర్ ఫిర్యాదు చేశారు. డబుల్‌బెడ్‌రూంలకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని, గతంలో కొందరు ఇందిరమ్మ ఇళ్లు పొంది బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్నారని, కొంత మంది స్థలాలు ఉంచుకున్నారని, ప్రస్తుతం నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూంలకు సంబంధించి వారు ఈ స్థలాలను తీసుకోవడం జరిగిందని, మళ్లీ వారికి డబుల్‌బెడ్‌రూంలు కేటాయించాలని కోరారు. అలాగే అధికారులకు చెందిన ఫోన్ నంబర్లు పనిచేయడం లేదని, సమాచారం ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

# విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన



అయిలాపూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు



బండలింగాపూర్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మెట్‌పల్లి(కోరుట్ల)/కోరుట్లరూరల్: వ్యవసాయానికి విద్యుత్ కోతలు విధించడాన్ని నిరసిస్తూ మండలంలోని బండలింగాపూర్‌లో రైతులు స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వ్యవసాయానికి నాలుగైదు గంటలకు మించి విద్యుత్ సరఫరా చేయడం లేదని కానీ ప్రభుత్వం 24గంటలు ఇస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగుకు సరిపోయే విధంగా సరఫరా చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గంగోని క్రాంతి, జంగిటి రాజేందర్, ఇట్టెడి గంగారెడ్డి, ముస్కారి శంకర్, గంగారాం, గంగాధర్ తదితరులున్నారు. అలాగే కోరుట్ల మండలం అయిలాపూర్ రైతులు స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట కోరుట్ల–అయిలాపూర్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేట్టారు. రాత్రి వేళల్లో మాత్రమే త్రీఫేజ్ సరఫరా చేస్తూ పగటి వేళ కోత విధిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ధర్నా విరమించేది లేదని బైఠాయించారు. దీంతో కోరుట్ల విద్యుత్ ఏడీఈ ఆంజనేయ రావు, ఎస్‌ఐ సతీష్ కుమార్ రైతుల వద్దకు చేరుకొని ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రమంతా ఇదే పరిస్థితి ఉందని తమ చేతుల్లో ఏమీ లేదని, పై నుంచి వస్తున్న విద్యుత్‌నే సరఫరా చేస్తున్నామన్నారు. పగటి వేళల్లో 12 గంటలు త్రీఫేజ్ ఇవ్వాలని రైతులు కోరగా, వీలైనంతగా పగటి వేళల్లోనే త్రీఫేజ్ ఇవ్వటానికి ప్రయత్నిస్తామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

## ఎస్పీని కలిసిన దివ్యాంగ సంఘం నాయకులు

- ఠాణాల్లో ర్యాంపులు, వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలని వినతి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

జగిత్యాలక్రైం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ ఎగ్గిడి భాస్కర్‌ను బుధవారం జిల్లా దివ్యాంగ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ చట్టం సెక్షన్ 91, 92 ఇంప్లిమెంటేషన్‌లో జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ర్యాంపులు, వీల్‌చైర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో లంకదాసరి శ్రీనివాస్, అస్గర్, మహ్మద్ ఖాన్, గొల్లపల్లి శ్రీధర్, గారిశెట్టి చంద్రశేఖర్, ధనలక్ష్మి, తాటిపల్లి రాజేశ్ పాల్గొన్నారు.

**పెండింగ్ కేసులు పరిష్కరించాలి**

గొల్లపల్లి(ధర్మపురి): పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. బుధవారం సాయంత్రం గొల్లపల్లి పోలీస్‌స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనిపై వాహనదారులు జాగ్రత్త వహించి నిబంధనలు పాటించాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ ప్రకాశ్, ధర్మపురి సీఐ కోటేశ్వర్, ఎస్సై దత్తాద్రి ఉన్నారు.

## కలెక్టర్‌కు అభినందనలు

జగిత్యాల/ధర్మపురి: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ షేక్‌యాస్మిన్ బాషాను జిల్లా టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజన్న, కొండ శ్రీధర్, విజయ్‌కుమార్, మల్లయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు. అలాగే ధర్మపురికి చెందిన జిల్లా వక్ఫ్ ప్రొటక్షన్ మెంబర్ సయ్యద్ ఆసిఫ్, ఎండీ ఇర్ఫాన్‌లు బుధవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

## న్యాయం చేయాలని వినతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్‌మండలం నర్సింగాపూర్‌కు చెందిన గడ్డం జలపతిరెడ్డి ఇటీవల ఇద్దరు కుమార్తెలతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విచారణ వేగవంతం చేసి ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని జలపతిరెడ్డి భార్య కవిత ఎస్పీ భాస్కర్‌కు విన్నవించారు.

# రోడ్ల విస్తరణ చేపట్టాలి

- కలెక్టర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల: జిల్లాలో రోడ్ల విస్తరణ అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం కలెక్టర్ యాస్మిన్‌బాషాను లేఖలో కోరారు. మేడిపల్లి మండల కేంద్రం నుంచి భీమారం మండలకేంద్రం వరకు సెంట్రల్ రోడ్ ఫండ్ ద్వారా తలపెట్టిన ఆర్ అండ్‌బీ విస్తరణ పనులు ప్రస్తుతం మేడిపల్లి, కొండాపూర్ గ్రామాల పరిధిలో కేవలం 25 ఫీట్ల వెడల్పుతో ఇరుకుగా ఉండటంతో వాహనాల పార్కింగ్ ఇబ్బందికరంగా ఉందని, సాయంత్రం వేళ వాహనాలు నిలిచిపోతున్నాయన్నారు. మేడిపల్లి, కొండాపూర్ గ్రామాల పరిధిలో ప్రత్యామ్నాయంగా బైపాస్‌రోడ్‌ల ఏర్పాటును గ్రామ శివారు బయట నుంచి పరిశీలించాలన్నారు. అవసరమైతే భూసేకరణకు ప్రస్తుతం మంజూరులో ఉన్న సీఆర్‌ఎఫ్ నిధులను కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. మేడిపల్లి నుంచి ప్రతిపాదించబడుతున్న ఆర్‌అండ్‌బీ విస్తరణ భీమారం, గోవిందారం ద్వారా చందుర్తి మండల కేంద్రం నుంచి హైదరాబాద్ లింక్‌రోడ్ ద్వారా విస్తరించే అవకాశం ఉందని, భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని లేఖలో పేర్కొన్నారు.

# సర్వేయర్ల ఇష్టారాజ్యం..!

'వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భూమి సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సదరు అధికారులు చుట్టుపక్కల యజమానులకు నోటీసులు ఇవ్వకుండానే అతడి భూమిని సర్వే చేసి పంచనామా కాపీని అందజేశారు. అయితే ఇదే అదునుగా భావించిన సదరు యజమాని మరో యజమానికి చెందిన భూమి హద్దులో ఉన్న టేకు చెట్లను కొట్టించాడు. దీంతో ఆ యజమాని తన భూమిలో చెట్లు కొట్టేశారని అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఇద్దరి మధ్య గొడవలు చోటుచేసుకోవడంతో టేకు చెట్లను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న యజమానికి ఇచ్చిన పంచనామా కాపీలో సర్వేయర్ టిపన్ ప్రకారం కొలతలు చేసి అందజేసినట్లు ఉంది. వాస్తవానికి వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట గ్రామానికి చెందిన టిపన్ జిల్లా పునర్విభజనలో లేకుండా పోయింది. సదరు సర్వేయర్ ఏ విధంగా భూమిని కొలిశాడో తెలియదు. దీంతో భూ కొలతల శాఖ అధికారికి ఫిర్యాదు చేయగా సదరు అధికారికి మెమో జారీ చేశారు'.

### టిపన్లు లేకుండానే భూ కొలతలు

- యజమానుల మధ్య హద్దు తగాదాలు
- ఇటీవల ఓ సర్వేయర్‌కు మెమో జారీ



ఇటీవల ఒకరికి సర్వేయర్ పంచనామా చేసిన కాపీ



సర్వేయర్‌కు ఇటీవల జారీ అయిన మెమో

జగిత్యాల: హద్దుల సమస్యలు వచ్చినప్పుడు భూ యజమానులు సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకుంటారు. నిబంధనల ప్రకారం చుట్టు పక్కల ఉన్న సర్వేనంబర్ల యజమానులకు నోటీసులు జారీ చేసి అనంతరం అందరి సమక్షంలో కొలిచి పంచనామా కాపీ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో సర్వేయర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నోటీసులు జారీ చేయకుండా మౌఖికంగా చెప్పి చుట్టుపక్కల సర్వే నంబర్ల యజమానులు రాకున్నా భూమిని కొలిచి పంచనామా కాపీలు అందజేస్తున్నారు. దీంతో యజమానుల మధ్య హద్దులకు సంబంధించి గొడవలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు సర్వేయర్లు అమ్యామ్యాలు పొందుతూ ఇష్టారాజ్యంగా భూములు కొలుస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**టిపన్‌లు ఎక్కడ?**

సర్వే నంబరులోని కొలత రికార్డులను టిపన్ అంటారు. భూముల కొలతలతో పాటు హద్దుల వివరాలు తెలిపే రికార్డుల ఆధారంగా గ్రామ పటాన్ని తయారుచేస్తారు. దీనినే టిపన్ నక్షగా పిలుస్తారు. భూ సర్వే చేయాలంటే నక్షతో కూడిన టిపన్ ఉండాలి. కాగా గతంలోని భూములకు సంబంధించిన దస్త్రాలే ఉండటం, అవి కూడా ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల జిల్లాల పునర్విభజనలో జగిత్యాల జిల్లా కేంద్రంగా మారడంతో జిల్లాలోని అనేక గ్రామాలకు చెందిన టిపన్‌లు దొరక్కుండాపోయాయి.

**45 రోజుల్లోపు..**

- జిల్లాలోని 18 మండలాల్లో గతంలో 18 మంది రెగ్యులర్ సర్వేయర్లు ఉండాలి.
- ప్రస్తుతం 14 మంది ఉన్నారు. కాగా ఇటీవల నలుగురు సెలవులపై వెళ్లారు.
- భూ సంబంధిత సమస్యలుంటే బాధితులు మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేశాక 45రోజుల్లోపు అధికారులు సర్వే చేసి హద్దులు గుర్తించి అందుకు సంబంధించిన మ్యాప్ తయారుచేసి అందించాలి.
- కానీ జిల్లాలో భూ కొలతల కోసం దరఖాస్తులు చేసుకుంటే అత్యధికంగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి.
- ఆమ్యామ్యాలు లేనిదే ఫైళ్లు కదలడం లేదనే ఆరోపణలున్నాయి.
- దీంతో రైతులు, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.
- సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న ప్రక్రియ పూర్తి కాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో పంచాయితీలు తీవ్రమవుతున్నాయి.
- రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలకు కొంత మంది దూరమవుతున్నారు.
- వీటిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తేనే పెండింగ్ దరఖాస్తులు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యే అవకాశముంది.

| జిల్లాలో.. | |
|---|---|
| మండలాలు | 18 |
| గ్రామాలు | 380 |
| భూ విస్తీర్ణం | 7,05,922 ఎకరాలు |
| భూ సమస్యలపై ఈ ఏడాది వచ్చిన | |
| దరఖాస్తులు | 307 |
| ఉండాల్సిన టిపన్‌లు | 1,57,602 |
| ఉన్నవి | 97,000 |
| కన్పించకుండా పోయినవి | 60,602 |
| సర్వేయర్లు | 10 (రెగ్యులర్) |
| డీఐలు | ఇద్దరు (ఒకటి ఖాళీ) |

### నిబంధనల ప్రకారం కొలతలు చేపట్టాలి

కొన్ని గ్రామాలకు చెందిన టిపన్లు లేవు. ఇటీవల ఓ గ్రామానికి చెందిన రైతు భూమిని టిపన్ లేకుండా కొలవడం జరిగింది. సదరు సర్వేయర్‌కు మెమో జారీ చేశాం. సర్వేయర్లు నిబంధనల ప్రకారం కొలతలు చేపట్టాలి.

– వెంకటరెడ్డి, ఏడీ, భూ కొలతల శాఖ

## క్లుప్తంగా

### దరఖాస్తుదారులు అడ్రస్‌లు తెలియజేయాలి

జగిత్యాల: జిల్లా కేంద్రంలో నిర్మించిన 4,520 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం 11,771 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. దరఖాస్తుదారుల అర్హత గుర్తించేందుకు 45 మందిని నియమించడం జరిగిందని, జనవరి 7 నుంచి ఫిబ్రవరి 4 వరకు దరఖాస్తులన్నింటినీ పరిశీలించి సర్వే చేయడం జరిగిందని, కానీ ఇందులో 665 మంది దరఖాస్తులు విచారణ సమయంలో పేర్కొన్న అడ్రస్‌లలో లేరని తెలిపారు. విచారణ సమయంలో వారు పేర్కొన్న అడ్రస్‌లో లేకపోవడం వల్ల విచారణ చేపట్టలేదని, అట్టి దరఖాస్తు దారులు వారి అర్హత తెలుసుకునేందుకు తమ అడ్రస్ వివరాలను ఈనెల 9న మున్సిపల్, మండల రెవెన్యూ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

### డిగ్రీ ఫలితాల్లో ఎస్‌ఎస్వీ విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల: జగిత్యాలలోని ఎస్‌ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులు 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబర్చి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. బీఎస్సీ విభాగంలో ఐశ్వర్య 9.7తో యూనివర్సిటీ మొదటిస్థానం కైవసం చేసుకోగా అనూష 9.54 రెండోస్థానంలో నిలిచింది. రచన 9.44, మల్లీశ్వరి 9.41, కావేరి 9.4, సంఘవి 9.24, రమ్యశ్రీ 9.19, సుమలత 9.16, ప్రణయ 9.16, ప్రియాంక 9.15, వైష్ణవి 9.14, మల్లీశ్వరి 9.13, శిరీష 9.11, సాహితి 9.1, నవీన 9.6, ఫిరోజ్ 9.14, మానస 8.99 జీపీఏ సాధించి యూనివర్సిటీ టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శ్రీపాద నరేశ్, మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొడిమ్యాల(చొప్పదండి): కొడిమ్యాల మండలం పూడూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. మండలంలోని వెంకటాయిపల్లికి చెందిన నాగెల్లి తిరుపతిరెడ్డి(59) పని నిమిత్తం పూడూరు వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. తీవ్రగాయాలపాలైన తిరుపతిరెడ్డిని స్థానికులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగెల్లి కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

### ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు..

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్– అంబారిపేట గ్రామాల మధ్య బైపాస్‌రోడ్‌లో మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి బోనగిరి గంగాధర్ (30) మృతిచెందాడు. పోలీసుల వివరాలు జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన బోనగిరి గంగాధర్ మంగళవారం తాటిపల్లి గ్రామంలో తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని సోదరుడు గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

# ఉద్యోగాలు వద్దట..!

'ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ కెమికల్ కంపెనీ విద్యార్థులకు రూ.16వేల జీతంతో ఉద్యోగాలు ప్రకటించగా.. కరీంనగర్‌కు చెందిన విద్యార్థులకు టాస్క్ ప్రతినిధులు, కళాశాలల వారు సమాచారమందించారు. ఇందులో చాలా మంది ఇంటర్వ్యూలకు హాజరవగా నలుగురు కూడా రిపోర్టు చేయలేదు. డిగ్రీ పూర్తి చేసిన వారికి రూ.16 వేల జీతమిచ్చినా ఉద్యోగాల్లో చేరడం లేదు.'

'ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఓ విద్యార్థినికి ఒక కంపెనీల్లో ఉద్యోగం వచ్చింది. ఇంటర్వ్యూకు పంపించిన తల్లిదండ్రులు వివిధ కారణాలు చెప్పి ఉద్యోగానికి పంపించలేదు. దీంతో కంపెనీవారు సదరు ఉద్యోగం వేరే వారికి కేటాయించారు. అయితే ఇన్ని రోజులు స్కిల్స్ నేర్చుకొని ఉద్యోగం సాధించిన విద్యార్థిని ఇంటివద్దే ఉండిపోయింది. ఇలాగే చాలా మంది ఏళ్ల తరబడి శిక్షణ పొంది పలు ఇంటర్వ్యూలకు హాజరవడం లేదు. మరికొందరు ఉద్యోగం వచ్చినా వెళ్లడం లేదు'.


టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

- నైపుణ్యాల మెరుగుదిద్దుతున్న టాస్క్
- శిక్షణ వరకే పరిమితమవుతున్న విద్యార్థులు
- ఉద్యోగాల ఇంటర్వ్యూలపై అనాసక్తి
- తల్లిదండ్రులు పంపకపోవడమే ప్రధాన కారణం
- వేతనాలు చాలవని మరికొందరి వెనకంజ
- ప్రభుత్వ తపన వృథా అంటున్న నిపుణులు
- కొలువులతోనే బంగారు భవిత అంటున్న వైనం

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుదిద్ది ఉద్యోగాలు సాధించే దిశగా తయారు చేయాలని ప్రభుత్వం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ని రూపొందించింది. ఇందులో భాగంగా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్‌తో పాటు వివిధ కోర్సుల విద్యార్థులను, కళాశాలలను టాస్క్‌లో నమోదు చేయించి ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. నమోదైన ప్రతీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో విడతల వారీగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. కాగా శిక్షణ తీసుకున్న విద్యార్థులు అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను వదులుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రుల అనాసక్తి అని తెలుస్తోంది.

**ఉద్యోగాలపై అనాసక్తి...**

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 62 కళాశాలలు టాస్క్‌లో నమోదు చేసుకున్నాయి. వీటిలో గతేడాది దాదాపు 2 లక్షల మంది నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 4,300 మంది నమోదు చేసుకున్నారు. టాస్క్ ప్రతినిధులు విడతల వారీగా కమ్యూనికేషనల్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, రెజ్యూమ్ సెట్టింగ్, ప్రజేంటేషన్ స్కిల్స్, అపిటిట్యూడ్, టీం వర్క్, గ్రూప్ డిస్కషన్, ప్రోగ్రామింగ్ టెక్నిక్స్‌తో పాటు విద్యార్థుల కోర్సులను బట్టి అవసరమయ్యే వివిధ రకాల నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. కంపెనీలకు, విద్యార్థులకు అనుసంధానం చేస్తూ కార్పొరేట్ కంపెనీలు కోరుకునే స్కిల్స్‌లో పటిష్టంగా శిక్షణ ఇస్తున్నారు. కానీ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్వ్యూల వరకు వెళ్లడం లేదు. టాస్క్ ప్రతినిధులు, కళాశాలల వారు సమాచారం అందించినా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇందులో ముఖ్యంగా డిగ్రీ విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నట్లు సమాచారం. జీతభత్యాలు లెక్కించి ఏమీ మిగలవని చెప్పి తల్లిదండ్రులే ఇంటి వద్దే ఆపేస్తుండగా, డిగ్రీతోనే లక్షల ప్యాకేజీ ఊహించుకున్న విద్యార్థులు కంపెనీలు అందిస్తున్న అవకాశాలను వదులుకుంటున్నారు.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టాస్క్‌లో నమోదైన కళాశాలల వివరాలు**

| జిల్లా | ఇంజినీరింగ్ | డిగ్రీ | డిగ్రీ, పీజీ | డిప్లొమా | మొత్తం |
|---|---|---|---|---|---|
| కరీంనగర్ | 7 | 11 | 8 | 3 | 29 |
| పెద్దపల్లి | 3 | 4 | 5 | 1 | 13 |
| రాజన్నసిరిసిల్ల | 1 | 3 | 1 | 1 | 6 |
| జగిత్యాల | 1 | 7 | 5 | 1 | 14 |
| మొత్తం | 12 | 25 | 19 | 6 | 62 |

### ఉద్యోగాల్లో చేరితేనే ఉజ్వల భవిష్యత్తు



టాస్క్‌లో నమోదైన విద్యార్థులకు ఎప్పటికప్పుడు శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి ఉద్యోగాలకు కావాల్సిన మెలకువలు నేర్పిస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు ఇంటర్వ్యూలకు దూరం కాగా మరికొందరు ఉద్యోగాల్లో ఎంపికైనా జాయిన్ కావడం లేదు. తల్లిదండ్రులు పంపించకపోవడమూ ఒక కారణమే. డిగ్రీ తర్వాత వేతనాలు మొదట్లో కొన్ని సంస్థల్లో తక్కువగా ఉండి తర్వాత పెరుగుతాయి. ఉద్యోగం చేస్తూ పోతే అనుభవం పెరిగిన కొద్ది వేతనాలు పెంచుతారు. ఉద్యోగం చేస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి. – గంగాప్రసాద్, టాస్క్ రీజనల్ కోఆర్డినేటర్

**లక్షల్లో ప్యాకేజీలని ఊహలు**

డిగ్రీ, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు కంపెనీలు ప్రస్తుతం ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇందులో భాగంగా కంపెనీలు మొదట్లో తక్కువ వేతనాలు ప్రకటిస్తుండగా, జీతాలు రూ.లక్షల్లో ఊహించుకుంటున్న విద్యార్థులు అటువైపు వెళ్లడంలేదు. పోటీ పడి స్కిల్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంపై ఆసక్తి చూపడం లేదు. తద్వారా రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని విద్యారంగ నిపుణులు భావిస్తున్నారు. యువతరానికి ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా కల్పించాలనే ప్రభుత్వ తపన వృథా అవుతుందని బాధపడుతున్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు వారి పంతా మార్చుకొని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెబుతున్నారు.

### జగిత్యాలలో గడీల పాలన

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాలలో ప్రజాస్వామ్య పాలన లేదని, గడీల పాలనే నడుస్తుందని బీఎస్పీ అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణితో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కేసీఆర్ సొత్తు కాదని, రాచరిక పాలన నడుస్తున్నదని, ఇందుకు నిదర్శనం శ్రావణికి జరిగిన అన్యాయమేనన్నారు. ప్రజాస్వామికంగా ఎన్నికై అందరి మన్ననలు పొందిన నాయకురాలని, ఆమెకు అండగా ఉంటామన్నారు. బీఆర్‌ఎస్‌కు రోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు. అంతకుముందు ప్రవీణ్‌కుమార్, శ్రావణి ఇంటికి వెళ్లి పరామర్శించారు. భవిష్యత్‌లో తన రాజకీయ అంశాలతో పాటు పలు విషయాలు చర్చించినట్లు తెలిసింది. ఆయన వెంట పలువురు బీఎస్పీ నాయకులున్నారు.

### అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్, యూసుఫ్‌నగర్ గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావును ఎంపీపీ తోట నారాయణ కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. ఎంపీపీ వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరక్టర్ గుగ్గిళ్ల సురేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ తోట లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో 'శ్రీచైతన్య' సత్తా

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మూడో, ఐదోసెమిస్టర్ ఫలితాల్లో శ్రీ చైతన్య డిగ్రీ విద్యార్థులు సత్తా చాటారు. బీఎస్సీ విభాగంలో ఎం.ప్రణయ 9.2, సయ్యద్ సారా 9.2, ఎల్.అఖిల 9.1, ఎస్.పవిత్ర 9.1, కే.సాత్విక 9.1, వి.అంజలి 9.0, బిందు శ్రీ 9.0, వై.దీపిక 9.0, ఏ.రశ్మిత 9.0.. బీకాం, మేనేజ్మెంట్ విభాగంలో బి.రాహుల్ 9.2, కే.సౌమ్య 9.1, బిందు శ్రీ 9.0 జీపీఏ సాధించారని, చాలామంది విద్యార్థులు 8.5 జీపీఏకు పైగా సాధించి యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అన్నారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్.ఎల్.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్

## వాణినికేతన్ విద్యార్థుల ప్రతిభ

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో వాణి నికేతన్ డిగ్రీ,పీజీ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబర్చినట్లు శాతవాహన ఈసీ మెంబర్, కళాశాల కరస్పాండెంట్ ఐ.దీపిక తెలిపారు. టి.నవ్య 9.08, సుహానా 8.78, డి.శ్రావణి 8.68, డి.సౌమ్యమిత్రా 8.6, జె.దర్శిని 8.57, కామర్స్ విభాగంలో కే.పూజిత 8.65, ఎం.శ్రావణి 8.63, ఏ.ఉమాదేవి 8.52, ఆర్ట్స్ విభాగంలో నందుకుమార్ 8.5 జీపీఏ సాధించారు. ఎం.వైష్ణవి 9.14 ,టి.శిల్ప 8.89, ఈ. అర్చన 8.7, ఏ.హర్షిని 8.44, ఎం.మొహసిన్ అహ్మద్ 8.34, అభిలాష్ 8.27, ఐ.అనూష 8.13,ఆర్ట్స్ విభాగంలో కె.మౌనవ్య 9.58, డి.శ్రీవర్ష 8.86, ఈ. శివాని 8.2 ఎస్‌జీపీఏ సాధించారు. 146 మంది 8.0ఆపైన అధిక ఎస్‌జీపీఏలు యూనివర్సిటీస్థాయిలో సాధించారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బుధవారం కరస్పాండెంట్ ఐ.దీపిక, ప్రిన్సిపల్ డి.వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ దీపిక

### 396 కేసులు పరిష్కారం

జగిత్యాలక్రైం: జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో బుధవారం వరకు 396 డ్రంకెన్ డ్రైవ్ కేసులు పరిష్కరించినట్లు ట్రాఫిక్ ఎస్సై రాము తెలిపారు. కేసుల పరిష్కారం ద్వారా రూ.4.40 లక్షలు జరిమానా రూపంలో వసూలు చేయడం జరిగిందన్నారు. ఈనెల 10వ తేదీ వరకు లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, ఇంకా ఎవరైనా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కేసులున్న వారు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ధర్మపురి: మండలంలోని తుమ్మెనాల జాతీయ రహదారిపై మూల మలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనాయి. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన శేఖర్, వినోద్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా తుమ్మెనాల మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం ప్రమాదానికి గురై ఇద్దరికి గాయాలైనాయి. అదే సమయంలో అటువైపు వెళ్తున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ తక్షణమే స్పందించి 108 అంబులెన్సుకు ఫోన్ చేశారు. క్షతగాత్రులను వైద్య చికిత్సల నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## ఎస్సారెస్పీ నీటిపై సీఎం తీరు సరికాదు

- పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు


మాట్లాడుతున్న సుజిత్‌రావు

మల్లాపూర్(కోరుట్ల): ఉత్తర తెలంగాణ రైతులకు వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీళ్లపై సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్న తీరు సరికాదని పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని రేగుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సారెస్పీపైన మహరాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టు నిర్మించడంతో రైతులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాలు కాపాడాల్సిన సీఎం కేసీఆర్ గోదావరి జలాలను లిఫ్ట్‌ఇరిగేషన్‌తో మహారాష్ట్ర రైతులు వినియోగించుకోవాలని సలహా ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల ప్రయోజనార్థం రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. చివరి బడ్జెట్ సమావేశాల్లో రూ.90వేల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడంతో నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న రైతులను ప్రభుత్వం తీవ్రంగా వంచించిందని దుయ్యబట్టారు. రూ.లక్ష రుణమాఫీతో పాటు రైతు సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, నాయకులు మామిడి రాజశేఖర్‌రెడ్డి, ఇప్పపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యం.. ఉత్కంఠకు తెర

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని బుధవారం ఉపాధ్యాయుల కళ్లుగప్పి పాఠశాల నుంచి వెళ్లిపోయింది. దీంతో పాఠశాల యాజమాన్యం కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో పాఠశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థిని జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామ శివారులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అక్కడే ఉన్న పూజారి గ్రామ సర్పంచ్ గోడిశెల గంగాధర్, ఆలయ చైర్మన్ గోనెల బక్కన్న, వైస్ చైర్మన్ గంగాధర్‌లకు సమాచారం అందించాడు. దీంతో వారు విద్యార్థిని చేరదీసి వివరాలు అడగ్గా పొంతనలేని సమాధానాలు చెప్పింది. ఈక్రమంలో సర్పంచ్ పట్టణ సీఐ కిశోర్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడకు వెళ్లి విద్యార్థిని తీసుకువచ్చి సీఐ సమక్షంలో వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో అదృశ్యమైన విద్యార్థిని సంఘటన ఉత్కంఠకు తెరపడింది.



### కిరాణ దుకాణంలో అగ్నిప్రమాదం

కథలాపూర్(వేములవాడ): మండల కేంద్రంలో బుధవారం ఉదయం రోహిత్ కిరాణం దుకాణంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో నిత్యవసర వస్తువులు కాలి పోయినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని దుంపేట రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభంపై వైర్లు తెగి పడిపోవడంతో కిరాణం దుకాణంలోకి మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.70 వేల విలువ గల నిత్యవసర వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు చిలుక సురేందర్ తెలిపారు. కాగా అగ్నిప్రమాదం జరిగిన వెంటనే బాధితుడు, గ్రామస్తులు స్పందించి పైపులతో నీళ్ల చల్లడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు.


కాలిపోయిన వస్తువులు

### గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

పెగడపల్లి(ధర్మపురి): గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతనిధి మర్రిపల్లి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నారై పాలసీ ఎన్నికల హామీగానే మిగిలిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికులను విస్మరించిందన్నారు. ఉద్యోగ నియామకాలు లేక అనేక మంది యువత గల్ఫ్‌బాట పట్టారని, అక్కడ సరైన ఉపాధి లేక తిరిగి వచ్చి అప్పులపాలై అవస్థలు పడతున్నవారు అనేక మంది ఉన్నారన్నారు. ఇలాంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నారైల ద్వారా ఏటా సుమారు రూ.1,200 కోట్లు ఆదాయం విదేశీ మారక ద్రవ్యం రూపంలో వస్తున్నా గల్ఫ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.వెయ్యి కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, మండల ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, పెంట నరేందర్ పాల్గొన్నారు.

## భార్య కోసం వెళ్లిన భర్త దారుణ హత్య

- భార్య అమ్మమ్మ ఇంట్లో కిరాతకం
- నర్సింగాపూర్‌లో హత్య.. రుద్రంగిలో విషాదం
- విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తాం : డీఎస్పీ


గణేశ్(ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

చందుర్తి(వేములవాడ): భార్య జాడ కోసం వెళ్లిన భర్త దారుణహత్యకు గురైన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని నర్సింగాపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. రుద్రంగికి చెందిన రణవేణి గణేశ్(27), వేములవాడరూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన సింగరవేణి స్వప్న రెండున్నరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గణేశ్ గ్రామంలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. 18 నెలల పాటు అన్యోన్యంగా ఉన్న జంటకు ఏడాదిగా కాపురంలో కలహాలు ప్రారంభమయ్యాయి. గత 15 రోజుల క్రితం భర్త గణేశ్ భార్యపై చెయ్యి చేసుకోవడంతోపాటు విద్యుత్‌షాక్ పెట్టాడు. దీంతో స్వప్న తప్పించుకుని వట్టెంల గ్రామంలోని తల్లిగారింటికి వెళ్లింది. భర్త గణేశ్‌పై వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇద్దామనే క్రమంలో స్వప్న పోలీస్‌స్టేషన్‌కు రాకపోవడంతో వాయిదాపడింది. నాలుగు రోజుల క్రితం భార్య కోసం అత్తగారింటికి, ఇల్లంతకుంట మండలం వంతడుపులలోని భార్య అక్క ఇంటికెళ్లి వాకబు చేశారు. అక్కడ స్వప్న లేకపోవడంతో రుద్రంగికి తిరిగొచ్చాడు. తన ఆచూకీ కోసం భర్త తిరుగుతున్నాడని తెలుసుకున్న స్వప్న చందుర్తి మండలం నర్సింగాపూర్‌లోని అమ్మమ్మ గారింట్లో తలదాచుకుంటోంది. ఈ విషయం తెలుసుకున్న గణేశ్ మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో రుద్రంగి నుంచి బయలుదేరి వెళ్లాడు. గణేశ్ రాకను గమనించిన ఇంట్లో ఉన్న మహిళలే కంట్లో కారం చల్లి గొడ్డలితో దాడి చేశారని డీఎస్పీ నాగేంద్రాచారి తెలిపారు. హత్యలో ఎవరి ప్రమేయం ఎంత ఉందనే వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని వివరించారు. సంఘటన స్థలాన్ని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమేశ్ పరిశీలించారు.

**హత్య చేసి.. 100కు డయల్ చేసి**

నర్సింగాపూర్‌లో గణేశ్ హత్య జరిగిన విషయం 100కు డయల్ చేసి చెప్పడంతోనే చందుర్తి పోలీసులకు తెలిసింది. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో డయల్ 100కు సమాచారం రావడంతో వెంటనే చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట ఎస్సైలు రమేశ్, ప్రభాకర్, రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గణేశ్ మృతిచెంది ఉన్నాడు. తెల్లవారేసరికి గ్రామంలో పోలీస్ వాహనాలు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. గ్రామంలో హత్య జరిగినట్లు తెలియడంతో ఉలిక్కిపడ్డారు.

**హత్య చేస్తాడని.. భయపడే హతమార్చారా?**

వారం రోజులుగా భార్య ఆచూకీ కోసం తిరుగుతున్న గణేశ్ ఆవేశంతో ఉన్నాడని భార్య తరఫున బంధువులు భావించారు. తమను ఎక్కడ హత్య చేస్తారనే ముందస్తుగానే హతమార్చారా.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. మృతుడి తండ్రి చంద్రయ్య ఆరోపణలతో గతంలో శత్రుత్వం ఉన్న రుద్రంగికి చెందిన వ్యక్తి గణేశ్‌ను హత్య చేశాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. అక్రమ సంబంధమే హత్యకు కారణమని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి మాట్లాడుతూ ప్రాథమిక విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.